క్లుప్తంగా...

నేడు ఆయుష్మాన్ భవ హెల్త్ మేళా

లాలాపేట: ఆయుష్మాన్ భవ ప్రచార కార్యక్రమంలో భాగంగా లాలాపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం హెల్త్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ హెల్త్ మేళాలలో గాంధీ మెడికల్ కళాశాల వైద్యులు పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 28, బెండకాయ 23, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 41, పచ్చకాకర 23, పందిరి బీర 18, క్యాబేజీ 11, క్యారెట్ 25, దొండ 18, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 23, కీర 18, దోసకాయ 16, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 28, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రైల్వే కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల ప్రచారం



సనత్‌నగర్: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల దృష్ట్యా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో గురువారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్టోబర్ 10న సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని హెడ్ క్వార్టర్స్‌లో, 12న ఔట్ స్టేషన్లలో ఎన్నికలు జరుగుతాయని సంఘ్ డివిజన్ అధ్యక్షుడు ఎన్వీఎస్ చౌదరి తెలిపారు. సొసైటీ డైరెక్టర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేగి మురళీకృష్ణతో పాటు తన ప్యానెల్ అభ్యర్థులందరినీ గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎద్దు నారాయణ శ్రీనివాస్, నాగరాజు ప్రసాద్, రామరాజు, జలీల్ అహ్మద్, సత్తికుమార్‌రెడ్డి, సీహెచ్.శ్రీనివాసరావు, నరసింహారావు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి జేఏసీ పునరుద్ధరణ

● 36 మందితో నూతన కార్యవర్గం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ విద్యార్థి జేఏసీ, ఓయూ విద్యార్థి జేఏసీలను పునరుద్ధరించారు. గురువారం ఓయూ గెస్ట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో టీఎస్ జాక్ ఛైర్మన్ రుద్రవరం లింగంస్వామి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులు శరత్, అధ్యక్షులు బద్రీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నగేష్, వైస్ ఛైర్మన్లుగా గాదె వెంకట్, రమేష్, శేశు, పాపారావు, అశోక్‌నాయక్, రంజిత్, ఉపాధ్యక్షుడిగా వెంకట్, లెనిన్‌రాజు, విజయ్, సైదులు, అరుణ్‌కుమార్, అధికార ప్రతినిధులుగా నారాయణ, ఎం.రవి, ఓదెలు,జాన్, ప్రచార కార్యదర్శులు కృష్ణ, సహాయ కార్యదర్శి ఈశ్వర్, సెక్రెటరీగా నవీన్‌రాజు, న్యాయ సలహాదారుగా సురేష్ నియమితులయ్యారు. ఓయూ జేఏసీ అధ్యక్షులుగా దర్శన్, ఉపాధ్యక్షులుగా మాడవి అజయ్, పి.అజయ్, వంశీయాదవ్, అధికార ప్రతినిధులుగా సుమంత్, ఉదయ్, జనరల్ సెక్రెటరీలు అజయ్, శివ, మల్లేష్, ప్రచార కార్యదర్శులు ప్రశాంత్, సైదాబాబా నియమితులయ్యారు. రాబోవు ఎన్నికల్లో ఉద్యమ విద్యార్థి నేతలకు ప్రతి నుంచి 10 మందికి ఎమ్మెల్యే టికెట్లు, ఇతర పదవుల కోసం పోరాడతామని లింగస్వామి పేర్కొన్నారు.

బంగారు గాజులు దొంగిలించిన మహిళపై కేసు

అమీర్‌పేట: అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఓ మహిళ బంగారు గాజులు దొంగిలించిన ఆస్పత్రి సిబ్బందిపై కేసు నమోదైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మధురానగర్‌కు చెందిన విశ్రాంత శాస్త్రవేత్త పెద్దిరాజు లీల అనారోగ్యంతో అమీర్‌పేటలోని ప్రైమ్ ఆసుపత్రిలో చేరింది. స్పృహలో లేని లీలను ఓ గది నుంచి మరో గదిలోకి మారుస్తున్న సమయంలో ఆమె చేతికి ఉన్న 20 గ్రాముల బంగారు గాజులు సిబ్బంది తమ చేతివాటంతో కాజేశారు. సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా స్వీపర్‌గా పనిచేసే మహిళలను అదుపులోకి తీసుకుని విచారించగా గాజులు దొంగిలించినట్లు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేశారు.



గణనాథుడికి పూజలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



చిలకలగూడలోని గణనాథుడిని దర్శించుకున్న లక్ష్మణ్



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ సామల హేమ



వినాయకుడి పూజలో పాల్గొన్న నాగులూరి సాయిబాబా, శ్యామ్

జనం వెంట రాగా.. గంగమ్మ ఒడికి చేరగా



సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డు నుంచి నిమజ్జనోత్సవానికి తరలిస్తున్న దృశ్యం

అట్టహాసంగా నిమజ్జనోత్సవం | ఏర్పాట్లు చేసిన అన్ని శాఖల అధికారులు

నవరాత్రుల పాటు పూజలందుకున్న గౌరీసుతుడు గురువారం గంగమ్మ చెంతకు చేరుకున్నాడు. లడ్డూల వేలం పాటలు, భక్తుల కోలాహలం అన్నదాన కార్యక్రమాలు, యువకుల నృత్యాలతో సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలన్నీ కిక్కిరిసిపోయాయి. అక్కడక్కడ స్వాగత వేదికలు ఏర్పాటు చేసిన నిమజ్జనానికి వస్తున్న భక్తులు, నిర్వాహకులకు స్వాగతం పలికారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం

మత సామరస్యానికి ప్రతీకగా..

బన్సీలాల్‌పేట్: ఐడీహెచ్ కాలనీలో యంగ్ స్టార్స్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకుంటున్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ యువకులు కలిసి 14 ఏళ్లుగా నవరాత్రోత్సవాలను నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. నిర్వాహకులు నావెల్ జార్జ్ (క్రిస్టియన్), చేతన్‌సాయి, కిరణ్‌దీప్ బాల్య స్నేహితులు. వీరు ప్రతి ఏటా గణేష్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వీరికి యాకూబ్, మోయిన్(ముస్లిం), ప్రియ, వాసు, ఆరతి బృందంగా ఏర్పడ్డారు. ప్రస్తుతం వీరంతా ఉద్యోగాలు చేస్తున్నారు. సదరు పరంపరను కొనసాగిస్తున్నారు. ప్రతి నెలా తమ సంపాదనలో ఎంతో కొంత పక్కకు వేసి వినాయక వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈమారు సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేసి పుణే నుంచి 30 అడుగుల వినాయక విగ్రహాన్ని తెప్పించి ఏర్పాటు చేశారు. గురువారం గణేష్ నిమజ్జనోత్సవాన్ని అత్యంత వైభవంగా..భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకతీతంగా నిర్వహిస్తూ స్థానికుల ప్రశంసలు అందుకుంటున్నారు.





నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



ఆటపాటలతో గణనాథుడి శోభాయాత్ర

లడ్డూల వేలం పాట



బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ వినాయకుడి లడ్డూను రూ.41 వేలకు కైవసం చేసుకున్న వల్లూరి నగేష్ దంపతులు



చంద్రబాబునగర్‌లో లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న భక్తులు



జెక్‌కాలనీ లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్ వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్న రాజశేఖర్, విశ్వనాథరాజు, నరసింహచారి



ఎర్రగడ్డ శాంతి సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతున్న కొలను బాల్‌రెడ్డి, గంటా మల్లేష్



బేగంపేట తాతాచారికాలనీ గణేషుడి లడ్డూను రూ 1.21 లక్షలకు దక్కించుకున్న సృజిత్‌గౌడ్



నిమజ్జనానికి తరలిన మోడల్‌కాలనీ గణనాథుడు



వారాసిగూడ శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

పిడమర్తి రవి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థి వ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించుదామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి పేర్కొన్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) 17వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీల వరకు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి పేద విద్యార్థులను చదువులకు దూరం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రవేటు వర్సిటీలను ప్రవేశపెట్టి, ప్రోత్సహిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను చెల్లించకుండా దారి మళ్లించారని ఆరోపించారు. పదేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా సుమారు 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలేదన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా, రెండు సార్లు గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి నిరుద్యోగుల జీవితాలతో చలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, రాష్ట్ర అధ్యక్షులు గాదె వెంకట్, ఎం.వెంకట్, సదన్, జాన్ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న పిడమర్తి రవి

ఇళ్ల పట్టాల విషయంలో కలిసి కట్టుగా ముందుకు రావాలి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్: సికింద్రాబాద్ రాణిగంజ్ కస్తూర్బానగర్ బస్తీలో ఇళ్ల పట్టాల సమస్య విషయంలో స్థానికులు కలిసి కట్టుగా ముందుకు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన బస్తీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. తన హయాంలో బస్తీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయం వంటి అనేక సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చినట్లు గుర్తు చేశారు. శిథిలావస్థలకు చేరిన జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. రాగద్వేషాలు, విభేదాలను వీడి బస్తీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. త్వరలో బస్తీ ఎన్నికలు నిర్వహించుకోవాలని లేనిపక్షంలో తానే నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు మల్లేష్, శివకుమార్, కోటి, పెంటమ్మ, అశోక్, మంజులా, కమలా పాల్గొన్నారు.



కస్తూర్బానగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని వైఎస్ఆర్‌టీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు నాగరాజు డిమాండ్ చేశారు. గ్రూప్–1 రద్దుతో పాటు ఇతర ఉద్యోగాల నియామకాలు పారదర్శకంగా జరగాలంటే కొత్త బోర్డును ఏర్పాటు చేసి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. టీఎస్‌పీఎస్సీ పై నిరుద్యోగులకు నమ్మకం కలగాలంటే ఛైర్మన్‌తో పాటు, ఇతర అధికారులు, సభ్యులను తొలగించి కొత్త వారిని నియమించాలన్నారు.

ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు



లాలాపేట: మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకుని గురువారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. తార్నాక డివిజన్‌కు చెందిన పలువురు ముస్లిం నాయకులు డిప్యూటీ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆమె మహమ్మద్ ప్రవక్త బోధనలైన శాంతి, కరుణ, ధార్మిక చింతన, దాతృత్వం, ఐకమత్యం, సర్వమాన సమానత్వం వంటి వాటిని ప్రజలందరూ ఆచరించాలని కోరారు. అల్లా ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో హిందూ, ముస్లింల ఐక్యతకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు.

వైఎంసీఏపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

రాంగోపాల్‌పేట్: వైఎంసీఏకు సంబంధం లేని విషయాలను ఆపాదిస్తూ అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు జయకర్ డేనియల్ హెచ్చరించారు. గురువారం వైఎంసీఏలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ స్టేట్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ (టీఎస్‌బీఏ)కు, వైఎంసీఏకు ఎలాంటి సంబంధం లేదని టీఎస్‌బీఏలో రూ.74 లక్షల అవినీతి జరిగిందని యూజీన్ జార్జ్ అనే వ్యక్తి వివిధ మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వైఎంసీఏ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న నార్మన్ ఇస్సాక్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారని అయితే ఆయన వైఎంసీఏ ప్రధాన కార్యదర్శిగా చెబుతున్నారని ఆయన వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి కాదన్నారు. కేవలం తమ దగ్గర బాస్కెట్ బాల్ కోచింగ్ సెంటర్ మాత్రమే కొనసాగుతుందని టీఎస్‌బీఏకు సంబంధం లేదన్నారు. అవినీతి జరిగిందని చెబుతున్న ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఎస్‌బీఐ బ్యాంకులో తమకు ఖాతా లేదని, ప్రేమ్ కుమార్ అనే వ్యక్తి ఎవరో తమకు తెలియదని, అభిషేక్ అనే వ్యక్తి కోశాధికారి కాదని సంబంధం లేని విషయాలను తమకు అంటగట్టి దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి లినార్డ్ మైరిన్, సీనియర్ కార్యదర్శి డాక్టర్ సంపత్, బ్రాంచ్ కార్యదర్శి జేమ్స్ కెన్నెత్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జయకర్ డేనియల్

భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తిదాయకం

సనత్‌నగర్: పిన్న వయస్సులోనే దేశం కోసం ఉరికొయ్యను ఎక్కిన భగత్‌సింగ్‌ను యావత్ భారతావని ఎన్నటికీ మరిచిపోదని వక్తలు పేర్కొన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా గురువారం అమీర్‌పేట సత్యం టాకీస్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గాంధీ సిద్ధాంతాలను పాటిస్తూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. విప్లవం వర్ధిల్లాలి అన్న నినాదంతో ప్రజలను చైతన్యపరుస్తూ బ్రిటిష్ పాలకులను గడగడలాడించారన్నారు. ఈ కార్యక్రమంలో కొలను బాల్‌రెడ్డి, సరాఫ్ సంతోష్, కరుణాకర్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, సురేందర్‌సింగ్, గోపీలాల్‌చౌహాన్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం